క్లుప్తంగా

వైద్య కళాశాలకు వైద్య పరికరాల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా కళాశాల 1985 బ్యాచ్‌కుచెందిన పలువురు పూర్వ వైద్య విద్యార్థులు రూ. 5 లక్షలు ఖరీదు చేసే పలు వైద్య పరికరాలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవికి అందజేశారు. కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలను డాక్టర్ పద్మావతిదేవి కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్‌నాగరాజు, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో తేడాలపై కేసులు నమోదు

నెహ్రూ నగర్: తూకంలో తేడాలు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పేర్కొన్నారు. డిప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు ఆదేశాల మేరకు పీవీకే నాయుడు మార్కెట్, నగర పాలకసంస్థ కార్యాలయం ముందు ఉన్న ద్రాక్ష పండ్లు అమ్మే దుకాణాల్లో మంగళవారం రాత్రి తనిఖీ నిర్వహించారు. తూకంలో తేడాలు ఉన్న నాలుగు ద్రాక్ష దుకాణాలపై నాలుగు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. పీవీకే నాయుడు మార్కెట్‌లో స్టాంపింగ్ లేని ఆరు కాటాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

పౌష్టికాహారం పరిశీలన

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం తీసుకొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలని బాలల హక్కుల కమిటీ మెంబర్ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం సంజీవయ్య నగర్ లోని అంగన్ వాడీసెంటర్‌లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. సెంటర్లో అందుతున్న పౌష్టికాహారం అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నది లేనిదీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

పెన్షనర్లకు పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనవరిలో రావాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలను చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ ఎన్.మోహనరావుకు టీచర్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శౌరిరాయలు, ఎన్.శరత్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళగిరిలోని రాష్ట్ర ట్రెజరీ కార్యాలయంలో మంగళవారం మోహనరావును కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మోహనరావును కలిసిన వారిలో సంఘ కోశాధికారి జె.రంగారావు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీఅగ్రహారం 11/2లో విద్యాసాగర్ (27) నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసై మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యాసాగర్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమయ్యనగర్‌కు చెందిన 29 సంవత్సరాల ఎస్.హరికృష్ణ మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం వెతికినా కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్

పాతగుంటూరు,లక్ష్మీపురం: ముస్లింలకు పవిత్రమైన షబ్ ఏ బరాత్ పండుగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. రాత్రి మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రంతా జాగారం చేసి అల్లాహ్‌ను ఆరాధించారు. ముస్లిం శ్మశాన వాటికల్లో తమ పూర్వీకుల సమాధులను సందర్శించి వారిని స్మరించుకున్నారు. సమాధుల వద్ద సామూహికంగా ప్రార్థనలు చేశారు.

రాయితీతో మహిళలకు వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీ నుంచి 31వ తేదీ వరకు స్థానిక బ్రాడీపేట 2వలైనులోని ఎస్‌హెచ్‌ఓ స్పెషాలిటీ ల్యాబ్స్‌లో రాయితీతో మహిళలకు థైరాయిడ్ హార్మోన్స్, క్యాన్సర్ మార్కర్స్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లింగ వివక్ష లేని సమాజమే ధ్యేయం కావాలి

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కలెక్టరేట్ ఉద్యోగులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

గుంటూరు వెస్ట్: లింగబేధం, వివక్షలేని సమాజం రావాలని దానికి అందరం కృషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. అయితే కొన్ని ప్రదేశాల్లో స్త్రీ, పురుష వత్యాసాలు చూపిస్తూ, కొందరు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విధానం మారకపోతే ఇవే సమస్యలు మన కుటుంబ సభ్యులకు కూడా ఎదురుకావచ్చని చెప్పారు. మహిళలు ఉన్నత విద్యనభ్యసిస్తే ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు తీవ్ర పోటీనిస్తున్నారని చెప్పారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలపై తమ గొంతును గట్టిగా వినిపించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ జేసీ, సబ్ కలెక్టర్, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకర రెడ్డి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో మహిళల పయనం

గుంటూరు ఎడ్యుకేషన్: అవరోధాలను అధిగమించి మహిళలు ప్రగతి పథంలో పయనిస్తున్నారని ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంకాం విద్యార్థినులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అదే విధంగా వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కరుణ మాట్లాడుతూ వృత్తి, విద్య, ఉపాధి రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రతి స్త్రీ తన వృత్తి, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత పాటించడంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈసందర్భంగా ఏఎన్‌యూ పరిశోధన విభాగ డైరెక్టర్ డాక్టర్ పి.కిరణ్మయి, కళాశాల విద్య ఆర్జేడీ వీఆర్ జ్యోత్స్నకుమారి, హిందూ కళాశాల కామర్స్ విభాగాధిపతి శాంతిలత, వైద్యురాలు ఎం.సుమిత్ర, హైకోర్టు న్యాయవాది వసుమతి పూర్ణిమను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత...

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని హైకోర్టు న్యాయవాది అనురాధ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలు–ముందస్తు సవాళ్లు అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యవక్తగా పాల్గొన్న అనురాధ మాట్లాడుతూ మారుతున్న కాలానికి తగిన విధంగా అన్ని పరిస్థితులను తట్టుకుని, మహిళలు అన్ని రంగాల్లోను, జీవితంలోనూ రాణించడం మంచి పరిణామమన్నారు. ప్రభుత్వ పరంగా కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, దిశ చట్టం గురించి అవగాహన పొందాలని సూచించారు. ప్రముఖ వైద్యురాలు వి.రమ్య, పీజీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్. అనితాదేవి, ఏబీపీ మనోహర్, మహిళా విభాగ కన్వీనర్ కె.కవిత, జమ్రుద్ బేగం, జ్యోతి, జయ శైలజ, శశికళ, విద్యార్థినులు పాల్గొన్నారు.



అధ్యాపకులు, స్కౌట్స్ ఉపాధ్యాయులతో రవీంద్రనాథ్‌రెడ్డి, స్వరూపరాణి, రోజిలీన్

మహిళా సాధికారత దిశగా ముందడుగు వేయాలి...

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు సాధికారత దిశగా ముందడుగు వేయాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. నాజ్ సెంటర్లోని సెయింట్ జోసఫ్ మహిళా బీఈడీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ బాలికలు విద్యావంతులుగా ఎదిగి అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ స్వరూపరాణి మాట్లాడుతూ మహిళలు అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరని అన్నారు. అనంతరం అధ్యాపకులతో పాటు స్కౌట్స్ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రోజిలీన్, స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు, స్కౌట్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ సుమిత్రను సత్కరిస్తున్న కిరణ్మయి, ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

లింగ వివక్షను రూపుమాపాలి..

గుంటూరు ఎడ్యుకేషన్: లింగ వివక్షను సమాజం నుంచి తరిమి కొట్టినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని హిందూ కళాశాల రాజనీతిశాస్త్ర విభాగ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మమ్మ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ప్రమదావనం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రమదావనం కన్వీనర్ బ్యూలారాణి అధ్యక్షతన జరిగిన సభలో గణిత శాస్త్ర అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఎస్వీఎస్ గిరిజ మాట్లాడారు. సభలో ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు సీహెచ్ అరుణ, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఐ.శాంతి లత, ఇంటర్ విభాగ ఇన్‌చార్జి డాక్టర్ అబ్బరాజు మంజుశ్రీ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి...

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ఏఎన్‌యూ విశ్రాంత ప్రొఫెసర్ అమ్మణ్ణి పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీఎన్ కాలనీలోని నారాయణ స్కూల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు బాధ్యతతో మెలగాలని, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఏజీఎం శివనాగరాజు మాట్లాడుతూ మహిళల శక్తి గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ కె.లవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చేసిన అభివృద్ధిని చూసే పెట్టుబడుల వరద

తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్లు

పట్నంబజారు: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ద్వారానే అది సాధ్యపడిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని కొనియాడారు. దేశంలో అత్యంత పేరుప్రతిష్టలు కలిగిన పారిశ్రామికవేత్తలు రూ.13లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటం సంతోషదాయకమన్నారు. తద్వారా లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలం వెళ్లదీసిందని, పెట్టుబడులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. సీఎం వైఎస్ జగన్ పరిపాలనలోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు, వైఎస్సార్ సీపీ నేతలు నూరిఫాతిమా, పి.రామయ్య, దుర్గాప్రసాద్, మధు, రమేష్, ఇస్రాయల్, గౌస్, వెంకట్, జక్రయ్య, రాజేశ్వరరావు, కార్పొరేటర్‌లు యాట్ల రవి, పాపతోటి అంబేడ్కర్, ధూపాటి వంశీ, కీసరి సుబ్బులు, స్వర్ణ, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

దళితకవి నూతక్కి అబ్రహం శత జయంతి వేడుక



నూతక్కి అబ్రహం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూ నగర్: దళిత కవి నూతక్కి అబ్రహం శతజయంతి వేడుక రామిరెడ్డి తోటలోని మేడ్ (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్ మాట్లాడుతూ ఎంతో ప్రతిభావంతుడైన రచయిత అయినప్పటికీ కేవలం పేదరికం, దళితుడు అనే కారణం చేత ఆయనకు రావలసిన మర్యాద, గుర్తింపు, ఆదరణ రాలేదన్నారు. ఆయన చేసిన అనేకమైన రచనలు ఇప్పటికీ కూడా అముద్రితాలు గానే ఉండిపోవటం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో ఇటువంటి మరుగున పడిన ఆణిముత్యాలను మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారి ప్రతిభను సమాజమంతా చాటడానికి, వారి యొక్క స్ఫూర్తిని సమాజంలోనికి తీసుకొని వెళ్లి సమాజాన్ని చైతన్యపరచటానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నూతక్కి అబ్రహం కుమారుడు పూర్ణాచారి, పేరుపోగు రాకేష్, నర్రా వెంకట కోటయ్య, కుక్కమూడి కిషోర్, ఆదిపెద్ది ఏసు, డాక్టర్ చిలకా వెంకటేశ్వరరావు, ఎ.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు సకాలంలో చెల్లించాలని, చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపునకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్ లోని 106 సచివాలయాల్లో కూడా ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేసి, పని వేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పెంచామని తెలిపారు. సెలవు దినాల్లో కూడా నగరపాలక సంస్థ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో ఎక్కడైనా కలుషిత తాగునీటి సరఫరా జరిగినా, నిర్దేశిత సమయం సరఫరా లేకున్నా, లీకులు ఏర్పడినా లేదా తాగునీటికి సంబంధించి ఇతర సమస్యలను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్ 0863–2345103, 104, 105 కి లేదా వాట్సప్ నంబర్ 98499 08391 కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అష్టోత్తర శత కలశ స్నపన

పాతగుంటూరు: నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచల స్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం అగ్నిహోత్రం రంగాచార్యులు నిర్వహణలో 12 ప్రధాన ద్రవ్యాలతో అష్టోత్తర శత కలశ స్నపన అభిషేకం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి



కార్యక్రమంలో పాల్గొన్న మస్తానయ్య, భక్తులు

పాతగుంటూరు: బృందావనగార్డెన్స్ కంచి కామకోటి పీఠ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం పద్మావతి కల్యాణ మండపంలో నిత్యహోమాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ రుత్వికులు వేదమంత్రాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధార్మిక ప్రాంగణం యాగశాలలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో రుత్వికులు వేద మంత్రాలతో పూర్ణాహుతి విశేషంగా నిర్వహించారు. భక్తులకు విశేష అన్న సమారాధన జరిగింది. సాయంత్రం సభా కార్యక్రమానికి ఆలయ అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. ధ్వజావరోహణం, బలిహరణం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సైనోత్సవం మంగళ హారతి, మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, మర్రెడ్డి రామకృష్ణారెడ్డి దంపతులు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవం.. తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు

పాతగుంటూరు: పాతగుంటూరు సుద్దపల్లిడొంకలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి దేవస్థానం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన, కర్పూర హారతి, నీరాజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యేలు షేక్ మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంపై కల్యాణ మూర్తులకు కనక తప్పెట్ల మేళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ మీరావలి, ఆలయ అధ్యక్షుడు తలారి రాము, ఉపాధ్యక్షుడు కుర్రా పున్నారావు, కార్యదర్శి కోటయ్యస్వామి, సహాయకార్యదర్శి బి. కృష్ణ, కోశాధికారి గోపాలకృష్ణ, ధర్మకర్త పొదిల మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రాచమంటి భాస్కరరావు, యర్రి సాయి, పోలవరపు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసుల రెడ్డి, ముసుగులో ఉన్న వ్యక్తి నిందితుడు

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొత్తపేట పోలీసుస్టేషన్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసులరెడ్డి మంగళవారం వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన శివనందం రాజేంద్రన్ ప్రస్తుతం గుంటూరులో ఉంటున్నాడు. రైల్వేస్టేషన్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద రాజేంద్రన్ గత 20 సంవత్సరాల నుంచి సన్యాసం తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసగా మారిన నిందితుడు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకునివచ్చి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. రాజేంద్రన్ నుంచి 1 కిలో 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనరిచిన సిబ్బందిని అభినందించారు.

విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు

గుంటూరు మెడికల్: వరల్డ్ ఉమెన్స్ డే సందర్భంగా స్థానిక గుంటూరువారితోటలోని విక్టోరియా కాలేజీలో సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ఎలైట్ హాస్పిటల్స్ జనరల్ సర్జన్ డాక్టర్ దీప్తి ప్రవళిక మాట్లాడారు. ప్రిన్సిపాల్ బి.అప్పారావు, కరెస్పాండెంట్ ఇన్నయ్య పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సహచరుల చేయూత



చెక్కు అందిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: సహచర హోంగార్డులు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించడాన్ని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అభినందించారు. గతేడాది డిశంబర్ 10న గుంటూరు హోంగార్డు యూనిట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించే యు.బాల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో సహచర హోంగార్డులు అందరూ ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని బాల సతీమణి ధైర్యకుమారికి మంగళవారం డీపీఓలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన), జిల్లా హోంగార్డు యూనిట్ ఆర్ఐ రమేష్‌కృష్ణన్ పాల్గొన్నారు.

తొమ్మిది మొబైల్‌ఫోన్ల అప్పగింత

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను బాధితులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతుంది. మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం జనవరి 28న గుంటూరు జిల్లా పోలీసులు వాట్సాప్ నంబర్ 86888 31574 అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విధితమే. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మందికి మొబైల్‌ఫోన్లను నగరంపాలెంలోని డీపీఓలో ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అందించారు. ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన), ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

నేడు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్.వి.ఆర్.షుగర్ హాస్పటల్ అధినేత, మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కొత్తపేట భగత్‌సింగ్ సెంటర్‌లోని తమ హాస్పటల్ వద్ద ఉచిత వైద్య శిబిరం జరుగుతోందన్నారు.

హోప్‌విన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో...

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హోప్‌విన్ హాస్పటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని తమ హాస్పటల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతోందన్నారు. పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని మహిళలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హాస్పటల్ డైరెక్టర్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ కోరారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ

నెహ్రూనగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిసెట్టి కనకదుర్గ పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ నిర్మల ఈదా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పురుషుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం స్కూల్లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ వాసు, డాక్టర్ ఉమా, స్కూల్ కరస్పాండెంట్ డి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.సుజాత పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి శిక్షణ కార్యక్రమాలు దోహదం

ఏఎన్‌యూ: మహిళల స్వయం ఉపాధికి శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.శ్రీనివాస రెడ్డి అన్నారు. యూనివర్సిటీ సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఉజ్వల హోమ్‌లో ఉండే బాలికలు, మహిళలకు వెదురు బొంగులతో వస్తువుల తయారీపై వారం రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెదురు బొంగులతో తయారు చేసిన ఉత్పత్తులు, వస్తువులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని అందమైన ఆకర్షణీయమైన ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎస్ఆర్ విభాగం కో–ఆర్డినేటర్ ఆచార్య సరస్వతిరాజు అయ్యర్ మాట్లాడారు. కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ శేఖర్, ఉజ్వల హోమ్ నిర్వాహకులు సిస్టర్ రోజ్లినా, రూపా, శ్రీను పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మక అభివృద్ధి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పరిశీలన తత్వం, ప్రశ్నించే అలవాటు ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని చైతన్య పాఠశాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అంతర్ పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈసందర్భంగా రెండో తరగతి చదువుతున్న విద్యార్థి మేడా మురళి మనోహర్ కిడ్నీల పనితీరు విధానంపై స్వయంగా నమూనా తయారు చేసి, వివరించడం ద్వారా ద్వితీయ బహుమతి సాధించాడు. ఈసందర్భంగా రజత పురస్కారంతో పాటు ప్రశంసపత్రాన్ని ముఖ్య అతిథి డాక్టర్ ఇ. విజయ సుభాషిని అందజేశారు. ప్రిన్సిపాల్ కె.రాధిక, డీన్ రంజిత్, ఉపాధ్యాయులు స్వాతి, తదితరులు పాల్గొన్నారు.